క్లుప్తంగా

మండల వీఆర్ఏల నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన మండల వీఆర్ఏల ఐక్య సంఘం సభ్యులు

మద్దిపాడు: మండలంలోని వీఆర్ఏలు సోమవారం సమావేశం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వీఆర్ఏల ఐక్య సంఘం అధ్యక్షుడిగా వై శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా వై రాజు, కోశాధికారిగా యూత్ సావిత్రి, అధ్యక్షుడిగా కావూరి రాఘవులు, కార్యదర్శిగా ఎం.చెంచురావు, కార్యవర్గ సభ్యులుగా పూనూరు నరసయ్య, కావూరి కోటయ్య, బూసరపల్లి వెంకట ప్రసన్న బాబు, బత్తుల కోటేశ్వరరావు, కోట హనుమంతరావు, కొప్పోలు సుబ్బారావు, జి పూర్ణ చంద్రరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వీఆర్ఏలు తెలిపారు. నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా తహసీల్దార్‌ను కలిశారు.

విద్యార్థులు కష్టపడే తత్వం అలవరచుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సిటీ: విద్యార్థులు కష్టపడే తత్వం అలవరచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఏకేవీకే కళాశాలలో 45వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పాజిటివ్ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సంకల్ప బలం ఉండాలనే నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు కష్టపడే తత్వం అలవరచుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో జరిగిన నృత్య ప్రదర్శనలు విద్యార్థుల కేరింతల మధ్య ఉత్సాహభరితంగా కొనసాగాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, కళాశాల ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అనిల్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

వై పాలెం సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ అసైన్డు భూములు, సీలింగ్ భూములు, అటవీ భూములు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్న యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌పీఎస్ అధ్యక్షుడు కే సుజన్‌మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై పాలెం మండలం వెంకటాద్రిపాలెంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

నేడు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తపట్నం: మండలంలోని మడనూరులో కొలువైన ఉన్న రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమగునట్లు ఇన్‌చార్జి ఎండోమెంట్ ఈవో సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం అంకురార్పణ, 26న బుధవారం మహాశివరాత్రి, సాయంత్రం 7 గంటలకు అన్నదానం, 27 గురువారం 5 గంటలకు స్వామి వారి కల్యాణం తదుపరి సముద్రస్నానం, రాత్రికి నలుగురి దేవళ్ల గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, మార్చి 1 శనివారం ఈతముక్కల నుంచి రథం పాదుకు చేరుతాయని జరుగుతందని ఈవో తెలిపారు. కొత్తపట్నంలో కొలువై ఉన్న గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో మహ శివరాత్రి రోజున గ్రామోత్సవం, 27 గురువారం కల్యాణం నిర్వహించునున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని తిలకించాలని ఆయన కోరారు.



దొడ్డవరం ఎస్సీ కాలనీ వద్ద బోర్ చుట్టూ పేరుకొని ఉన్న వ్యర్థాలు



గ్రామంలో ప్రవేశించే రహదారిలో పడేసిన వ్యర్థాలు

చెత్తశుద్ధి లేని కూటమి

ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాల పేరుతో హడావుడి తప్పా.. చేసిందేమి లేదన్నట్లుగా ఉంది కూటమి ప్రభుత్వ పరిస్థితి. అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు కార్యక్రమం రోజున చీపురు పట్టుకొని ఫోటోలకు పోజులిచ్చామా.. పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పెట్టామా అన్నట్లుగా ఉన్నారు. ఫలితంగా గ్రామాల్లో పారిశుధ్యం లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

- మండలంలో అటకెక్కిన పారిశుద్ధ్యం
- దొడ్డవరంలో ఊరి నిండా చెత్తాచెదారం
- విజృంభిస్తున్న రోగాలు
- పట్టని అధికారులు

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఏ వీధిచూసినా చెత్తచెదారాలు, కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తప్పా ఏమి కనిపించడంలేదు. మండలం పరిధిలోని దొడ్డవరం గ్రామలో ప్రధాన వీధుల వెంట పిచ్చి మొక్కలు పెరిగి పోయి అడవిని తలపిస్తున్నాయి. సైడ్ కాల్వలు ఉన్నా వాటిని నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ పరిధిలో ఉన్న సైడు కాల్వలలో పూడిక తీత పిచ్చిమొక్కలను తొలగించేందుకు కూడా గ్రామా కార్యదర్శికి, మనసు రాలేదేమో అని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలోని చెత్తను తీసుకువచ్చి మెయిన్ రోడ్ లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, వ్యవసాయ సహకార సంఘం సొసైటీ వద్ద వేయడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను చెప్పుకుందాం అంటే ఇన్‌చార్జ్ కార్యదర్శి అందుబాటులో లేని పరిస్థితి. ఫోన్ చేసినా తీయడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి పారిశుద్ధ్య కార్మికులు చెత్తన సేకరించకుండా వదిలివేశారు. ఒకవేళ చెత్తను వీధుల వెంట సేకరిస్తే, చెత్త సంపద కేంద్రానికి తరలించే పరిస్థితి లేకపోవడం దారుణమని



ఎస్సీ కాలనీలోని కాలువల్లో పేరుకుపోయిన పూడిక

గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మండలంలో 22 పంచాయతీలు, 18 సచివాలయాలు ఉన్నాయి.

దోమలకు ఆవాసాలుగా కాల్వలు..

చెత్తను ఎస్‌డబ్ల్యూ పీసీలకు తరలించాల్సి ఉండగా వ్యవసాయ సహకార సంఘం సొసైటీ, పాత గార్లపాడుకు పోయే రోడ్డు వెంబడి పడేయడమేమిటో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన వీధిలోని ఎంపీపీ పాఠశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలకు ఆవాసాలుగా మారి పోయాయి. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద కాల్వలో చెత్తను తొలగించకపోవడంతో దోమలు బాగా పెరిగిపోయాయి. గతంలో వాటర్ స్కీం ద్వారా నీరు వస్తుండడంతో కాలువలు శుభ్రం అయ్యేవి. కాని పంచాయతీలో వాటర్ స్కీంలో అవినీతి బయటపడడంతో గ్రామస్తులు పన్ను కట్టడం మానేశారు. పన్నులు కడితే ఏమవుతుందోనని ఏ నాయకుడు, ఏ అధికారి వాడుకుంటాడో అని భయం ఆందోళనలో గ్రామస్తులు ఇంటి పన్ను నీటి పన్నులు కట్టేందుకు సుముఖంగా లేరు.

దొడ్డవరానికి రామంటున్న కార్యదర్శులు..

గతంలో పంచాయతీలో జరిగిన అవినీతి వలన గ్రామ పంచాయతీలో ఉద్యోగం చేయడానికి పంచాయతీ కార్యదర్శులు అమ్మో.. దొడ్డవరం పంచాయతీనా అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బదిలీల్లో భాగంగా దొడ్డవరం గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శి రాగా ఆ కార్యదర్శిని పాలకమండలి సభ్యులు వివిధ కారణాలు చూపించి ఒత్తిడి తేవడంతో పనిచేయలేనని అప్పటి ఎంపీడీవో వద్ద వాపోయిన పరిస్థితి. ఇటీవల కాలంలో ఆ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి కూడా అక్కడ పని చేయలేనని ఉద్దేశంతో మెడికల్ లీవ్ పెట్టి వెళ్లినట్లు సమాచారం. వెల్లంపల్లి తాళ్లూరు రోడ్డు వెంబడి చెత్తను తొలగించకపోవడంతో చెత్త బుట్టలతో నిండి దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇకపై అయినా తమపై జాలి చూపి గ్రామంలో పారిశుద్ధ్య పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

> **పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తాం..**
>
> దొడ్డవరం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై కొంత ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఇన్‌చార్జి కార్యదర్శి సెలవులో ఉండడం వలన ఈ ఇబ్బంది తలెత్తింది. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో దొడ్డవరం గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తాం.
>
> – కొండేపి రఘుబాబు, ఈవోపీఆర్డీ

> **15 రోజుల నుంచి ఎక్కడ వేసిన చెత్త అక్కడే..**
>
> 15 రోజుల నుంచి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్త తీయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జి కార్యదర్శి ఆరోగ్యం బాగలేదంటూ సెలవు పెట్టడంతో గ్రామంలో పలు రకాలైన పనులు నిలిచిపోయాయి. కార్మికులకు చెప్పేందుకు కార్యదర్శి లేకపోవడంతో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించాలి.
>
> – అంజిబాబు, గ్రామస్తుడు

మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకస్వామివారు

సంతనూతలపాడు: మహాశివ రాత్రి ఉత్సవాలకు మండల పరిధిలోని గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మండల కేంద్రంలోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతకస్వామి వారి దేవస్థానంలో వేకువజాముననే స్వామివారికి మహాన్యాస పూర్వక పూజలు, ఏకాదశ రుద్ర పంచామృతాభిషేకాలు, అమ్మవారికి పూలంగి సేవ, సహస్ర నామ కుంకుమార్చన అనంతరం 9 గంటలకు మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే 11 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో త్రిపురాంతకస్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజాధి కార్యక్రమాలు, సహస్రభిషేకాలు జరుగుతాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉభయ దాతలు ప్రతి ఏడాదిలో భాగంగా ఈ సారి మాజీ సర్పంచ్‌చి శిఘాకొల్లి నరసింహస్వామి, తమ్ముళ్ల శిఘాకొల్లి శివ శంకర్‌రావు, శిఘాకొల్లి వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులు అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున భక్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు తీర్థప్రసాదాలు స్వీకరించి త్రిపురాంతకస్వామి వారి కృపకుపాత్రులు కాగలరని ఎండోమెంట్ ఈవో ఎస్.నారాయణ రెడ్డి, అర్చకులు బుచ్చిబాబు శర్మ కోరారు. మద్దులూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కూడా శివరాత్రికి ఏర్పాట్లు చేశారు.

రూ.14.7 కోట్లతో మున్సిపాలిటీ బడ్జెట్‌కు ఆమోదం

- డీఎంఎఫ్, ఓడా నిధులతో అభివృద్ధికి ప్రతిపాదనలు



బడ్జెట్‌పై వివరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాజ్యలక్ష్మి

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.14.7 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన కమిషనర్ వై.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం చీమకుర్తి మున్సిపల్ పాలకవర్గం సమావేశం జరిగింది. సమావేశంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. రెవెన్యూ ఆదాయం ద్వారా రూ.6.34 కోట్లు, మూలధన ఆదాయం ద్వారా రూ.8.45 కోట్లు కలిసి మొత్తం రూ.14.7 కోట్లు ఆదాయంగా చూపించారు. దానిలో రెవెన్యూ వ్యయం కింద రూ.5.98 కోట్లు, మూలధన వ్యయం కింద రూ.8.75 కోట్లు చూపించారు. నికర మిగులు రూ.6.65 లక్షలుగా చూపించారు.

రూ.35 లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

మున్సిపాలిటీలో కాలువలలో పూడికతీత, నూతన మున్సిపల్ కార్యాలయానికి ప్రహరీతో పాటు ఇతర పనులను రూ.35 లక్షలతో చేపట్టటానికి పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వాటితోపాటు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.5 కోట్లు, ఒడా నిధులు రూ.1.50 కోట్లతో చీమకుర్తి మున్సిపాలిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయా సంస్థలకు ప్రతిపాదనలను పంపించేందుకు ఆమోదం తెలిపారు. వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన కౌన్సిలర్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల సత్తా



మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి

ఒంగోలు సిటీ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటారు. సోమవారం మంచి పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు సంస్థల అధినేత రమణారెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్‌లో 90 శాతం పైన సాధించిన విద్యార్థులు 22 మంది, 85 శాతంపైన 64 మంది, 80 శాతం పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 112 మంది ఉన్నారని చెప్పారు. వారిలో కె.లోక్‌క్రిటి 99.94 పర్సంటైల్ సాధించి (ఎస్‌సీ–క్యాట్ ఆల్ ఇండియా ప్రథమ స్థానం), ఎస్.ఇంద్ర 99.62 పర్సంటైల్, జె.శ్రీనివాసచారి 99.30, కె.గుణశేఖరరెడ్డి 99.22 పర్సంటైల్ సాధించారు. ఆల్ ఇండియా స్థాయిలో విద్యాసంస్థలకు గుర్తింపు తీసుకు రావడానికి సహకరించిన మా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఫలితాలు సాధించుటకు కృషి చేసిన డైరెక్టర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్ రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎస్‌వీ సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మహాశివరాత్రి వేడుకలు



స్వామి, అమ్మవార్లకు మంగళ హారతి ఇస్తున్న దక్షిణామూర్తి

ఒంగోలు మెట్రో: నగరంలోని సంతపేట షిరిడి సాయి బాబా మందిరంలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉపాలయంగా ఉన్న గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారికి మాఘమాసం శివ రాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం వేద పురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకం, బిల్వదళాలతో శివుడి ధర్మకర్త ప్రకాశం జిల్లా స్వాతి గ్రూప్ అధినేత కవర్తపు బాలకృష్ణ, సుజాత దంపతులు స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దేశ సమైక్యత కోసం పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మాబు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య సమైక్యతను కాపాడుకోవడం ద్వారా సామరస్యాన్ని నెలకొలపేందుకు ప్రజలను సిద్ధం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎస్ కే మాబు పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ, ప్రజాస్వామిక శక్తులపై పెరిగిన దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సోషలిజమే ప్రత్యామ్నాయమన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తతంగా తీసుకొని వెళ్లాలని చెప్పారు. ఈసమావేశంలో నగర నాయకులు శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తవనం చెంచయ్యకు ఉప్పు రైతుల నివాళి



తవనం చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉప్పు రైతులు

కొత్తపట్నం: ఉప్పు కొటారు భూముల సాధన పోరాట యోధుడు, దళితుల సమస్యలపై నిత్యం పోరాటం చేసి ప్రజల్లో గొప్ప పేరు తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే, సీపీఎం మాజీ కార్యదర్శి తవనం చెంచయ్యకు ఉప్పు రైతులు నివాళులర్పించారు. తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉప్పుకొటారుల్లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ స్వామిరెడ్డి మాట్లాడుతూ తవనం చెంచయ్య కొత్తపట్నం మండలంతో విడదీయని అనుబంధం ఉందన్నారు. కొత్తపట్నంలో దళితులకు పోరాటం చేసి మాగాణి పొలాలను ఇప్పించి స్థిరసాయిగా నిలిచాడన్నారు. ఈతముక్కలలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలిప్పించడం, సోమరప్పాడులో భూపోరాటాన్ని జరిపించడం, వజ్జిరెడ్డిపాలెంలో సుదీర్ఘంగా ఇళ్ల స్థలాల పోరాటం చేసి సాధించి పెట్టడాన్నారు. కొత్తపట్నంలోని సర్వే నంబర్ 1204లో ఉప్పు కొటారు భూములు 150 ఎకరాలు సాధించి పట్టాలు ఇచ్చి ఇప్పించారని గుర్తు చేశారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప్పు రైతులు, నాటారు ఆంజనేయులు, వెంకట్రావు, శ్రీను, లక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ఇంటింట ప్రచారం



దివ్యాంగుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న ఈశ్వరరావు

కొత్తపట్నం: దివ్యాంగుల సంక్షేమానికి ఇంటింట ప్రచారం నిర్వహించారు. సోమవారం ప్యానల్ అడ్వకేట్ నాయుడు ఈశ్వరరావు కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల సంక్షేమం కోసం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం దాని తీవ్రతగా ఉంటే వారిని గుర్తించి డీఎల్ఎస్ఏ ద్వారా నిర్ధారణ చేస్తారన్నారు. బాల్య వివాహాలు చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఎల్ఆర్ ఎస్ ఆంజనేయులు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఎంఈవో–2 పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష

ఒంగోలు సిటీ: జిల్లాలోని ఆరు ఆదర్శ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకునేందుకు ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మల్లికార్జునపురం, మిట్టమీదపల్లి, రాచర్ల, కనిగిరి, దర్శి, ముండ్లమూరు ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో నిర్వహిస్తారు. ఆదర్శ పాఠశాలలో బోధనామాధ్యమం ఆంగ్లంలోనే ఉంటుంది. ఈ పాఠశాలలో విద్యనభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు వసూలు చేయరు.

బీజామృతంతో విత్తన శుద్ధి

ఒంగోలు సిటీ: పలుపంటల విధానం వల్ల భూమికి సారవంతం.. రైతులకు అదనపు వస్తుందని ఆదాయం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రాధా సింగమనేని అన్నారు. సోమవారం ఒంగోలు రూరల్ మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ విభాగంలో డీపీఎం యు సుభాషిణి ఆధ్వర్యంలో రాధా తన సొంత పొలంలో పలుపంటల విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రధాన పంటగా దోస, అంతర పంటలుగా పుచ్చకాయ, బీర, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగు చేస్తున్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, సహచరులు



కుర్చీలు అందిస్తున్న ఎస్ఎస్ కేసీఎం పూర్వ విద్యార్థులు

సంతనూతలపాడు: పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే తేలికగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చిలకపాడు హైస్కూల్ హెచ్‌ఎం పీ స్వప్నరాజు పేర్కొన్నారు. మండలంలోని చిలకపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి గ్రేడ్లను సాధించి పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం చిలకపాడు క్లస్టర్ వేములపాడు, మట్టిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఎం. తిరుపతిరెడ్డి, కే.చంద్రమౌళిలు 20 కుర్చీలను అందించినందుకు వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు.

పూర్వవిద్యార్థులు ఆధ్వర్యంలో కుర్చీల బహూకరణ

సంతనూతలపాడులోని ఎస్ఎస్ కేసీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986–87లో పదో తరగతి పూర్తి చేసుకున్న బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు 15 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం ప్రమోద అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సూదన గుంట శ్రీనివాసరావు, రావుల సుబ్బారావు, బొడ్డు రామలింగయ్య, మట్టా మురళి, ఇందుర్తి నాగేశ్వరరావు, కారం శెట్టి నరసింహస్వామి, మేళం తదితరులు పాల్గొన్నారు.

మలేరియా పరీక్షల్లో అలసత్వం తగదు

మద్దిపాడు: మలేరియా పరీక్షల్లో సిబ్బంది అలసత్వం లేకుండా చేయాలని జిల్లా మలేరియా అధికారి మధుసూదన్‌రావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా మలేరియాశాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడుతూ నూతన సంవత్సరం నుంచి కొత్త చార్టులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మలేరియా జ్వరాలకు చేస్తున్న పరీక్షలు, రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే ఓపీలో 15 శాతం రోగులకు మలేరియా పరీక్ష కూడా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. డెంగీ కేసులు ఏమైనా ఉన్నాయా అంటూ విచారించారు. ఆయన వెంట డాక్టర్ వినీల చౌదరి, డాక్టర్ శిరీష, సబ్ యూనిట్ ఆఫీసర్ పి శ్రీనివాసరావు, వెంకారెడ్డి, సీహెచ్‌ఓ రజిత కుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి